# నేను నేనే-23

**Index** **Page no**


| | |
|---|---|
| 274. సంజాయిషీ-మౌనం-నియంత | 2 |
| 275. నీవు లేనే లేవు | 9 |
| 276. విచారణ అంటే-నిత్యానిత్యవస్తు వివేచన | 18 |

## 266. సంజాయిషీ-మౌనం-నియంత

చేసిన తప్పు కంటే, చెప్పుకున్న సంజాయిషీ పెద్ద తప్పు అయ్యిందట.

ఈ విచిత్రకథ విన్నారా ఎప్పుడైనా...?

మంత్రి ఓ రోజు  మసక చీకట్లో రాజును కౌగిలించుకున్నాడు.

ఇది తప్పు.

"ఎందుకు ఇలా చేసావు?" నిలదీసాడు రాజు మహోగ్రుడై...

"మహారాణి అనుకున్నాను మహారాజా..." అన్నాడు మంత్రి.

ఇది సంజాయిషీ.

* * *

చేసిన తప్పు కంటే

చెప్పుకున్న సంజాయిషీ

ఎంత పెద్ద తప్పు అయిందో చూశారా?

* * *

ఆధ్యాత్మిక విషయంగా-

ఒకడు అడగడం

ఇంకొకడు చెప్పడం అనేది కూడా ఇలాంటిదే.

ప్రశ్న, సమాధానము రెండూ తప్పే...

ఎవరు చెప్పినా సరే,

చెప్పబడిన ప్రతి సమాధానము తప్పే.

వాచా చెప్పబడిన సమాధానం ఎప్పుడూ దోష భూయిష్టంగానే ఉంటుంది.

అందుకే పరమశివుడు గురుదక్షిణామూర్తిగా మౌనస్వరూపంగా అవతరించాడు.

మౌనమే నిజమైన సమాధానం.

ఎంత పెద్ద సత్యమైనా సరే,

ప్రస్తావిస్తున్నావంటే "అది" అది కాకుండా అయిపోతుంది.

సత్యం ఎప్పుడూ ప్రస్తావనలోకి రాదు.

ప్రస్తావనలోకి వచ్చింది అంటే అది సత్యం కాదు.

ఊరికే ఉంటే అది అదిగానే ఉంటుంది.

"ఒకటి" అంటే రెండు అయిపోతుంది.

రెండు అంటే మూడు అయిపోతుంది.

ఊరికే ఉంటే "ఒకటి"గా ఉంటుంది.

* * *

వేదాలు... ఉపనిషత్తులు...

రమణ భాషణములు...

సద్గురు భాషణములు...

ప్రవచనకర్తల ప్రవచనాలు...

కొన్ని లక్షల ఆధ్యాత్మిక గ్రంథాలు...

అయినా సరే సమాధానం దొరకలేదు...

"నష్టోమోహః" అని ఎవడూ అనడం లేదు...

జ్ఞాని పుట్టుక  మాత్రం వీటితో సంబధం లేకుండా జరుగుతూనే ఉన్నది ప్రతి దశాబ్దంలోనూ.

అది ఈశ్వరనియతి.

అతనికి అక్కడ నించి వచ్చిన దారి మాత్రమే తెలుసుగాని, ఇక్కడనుండి అక్కడకు వెళ్లే మార్గం తెలియదు.

మధురైలో రమణుణ్ణి ఆత్మ ఆవహించింది...

అరయనినల్లూరులో రమణుణ్ణి జ్యోతి ఆవరించింది...

రెంటిలోనూ తన ప్రమేయం ఏమీ లేదు.

ఈశ్వర నియతి ప్రకారమే అలా జరిగింది.

ఇక ప్రతి ఒక్కడూ "ఆ స్థితిని పొందాలంటే ఏం చేయాలి?" అని అడుగుతూనే ఉన్నారు. వారు జీవితాంతం చెబుతూనే ఉన్నారు.

కానీ మరో రమణుడు రానేలేదు, రాడు.

నిజానికి ఇక్కడ నుంచి అక్కడకు వెళ్లే మార్గం అస్సలు లేనేలేదు.

ఈ ధ్యానాలు, ఈ జపాలు, ఈ యోగాలు.... ఇవేవీ మార్గాలు కావు.

నిజం.

అక్కడ నుంచి ఇక్కడకు ఎలా వచ్చామో.... ఇక్కడ నుంచి అక్కడకు కూడా అలానే వెళతాము.

ఇది తప్పదు.

కాబట్టి ప్రత్యేకించి దానికై వెతకనవసరం లేదు.... అనేదే నా ఈ వ్యాస ఉద్దేశం.

మరేం చేయమంటారు? అంటారా?

శిల్పం ఉంది అంటే, శిల్పి ఉన్నట్టే.

జగత్తు ఉంది అంటే జగదీశ్వరుడు ఉన్నట్టే.

వాడొకడు ఉన్నాడని తెలిస్తే చాలు...

తనకు గొప్ప జ్ఞానం ఉన్నట్టే.

ఈశ్వరుడు నియంత...

నియంత అంటే దాని అర్ధం హిట్లర్ లాంటి దుర్మార్గుడు అనికాదు.

కర్త-కర్మ-క్రియ మూడూ తానైనవాడు అని అర్ధం.

నియంత అంటే సర్వశక్తిమంతుడు అని అర్ధం.

తిరుగలి తిప్పేది తానే.

తిరుగలిలో నలిగేదీ తానే.

తిరుగలీ తానే.

ఆయన్ను పొందటానికి రెండవ వస్తువు లేదు.

బాబు చిటికెనవ్రేలు,

బాబును పొందండానికి

సాధన చేయడం లాంటిదే.

ఈశ్వర శరీరంలో నేనొక చిటికెనవ్రేలు అని ఉండడమే అద్వైతం.

"ఆయన కంటే వేరుగా నేను లేను"

అన్న జ్ఞప్తికి మించిన సాధన లేదు. సిద్ధి కూడా అదే.

"పొందటం" అనే క్రియ అస్సలు లేనే లేదు.

నక్షత్రాలను చూస్తాం. అంతే.

పొందటం అంటూ ఏమీలేదు కదా!

ఈశ్వరుడు జగద్రూపంగా ఉన్నాడు. అంతే. పొందటం అంటూ ఏమీలేదు.

ఈ చూడటమే ఈశ్వర సాక్షాత్కారం.

ఈ అవగాహనే ఈశ్వరానుభవం.

"దేవుడు ప్రత్యక్షం కాడు.

ప్రత్యక్షమే దేవుడు."

* * *

ఎవడి సమాధానమూ నాకొద్దు.

నేనే సమాధానం అని ఉండు.

ఏ దైవమూ నాకొద్దు.

నేనే దైవం అని ఉండు.

ఏ క్షేత్రమూ నాకొద్దు.

నేనున్న చోటే క్షేత్రం అని ఉండు.

మాటలు వొదిలి "మౌనంగా" ఉండు.

పరిధిని వొదిలి "కేంద్రంగా" ఉండు.

తెలుసుకోవడం వొదిలి "తెలివి"గా ఉండు.

దర్శనం వొదిలి "ద్రష్ట"గా ఉండు.

కర్తవ్యం వొదిలి "సాక్షి"గా ఉండు.

* * *

ఇలా స్థిర నిశ్చయంతో ఉన్నట్లయితే

నిశ్చయంగా దేవుడే నీ దర్శనానికి వస్తాడు.

* * *

## 275. నీవు లేనే లేవు

ఈ ఉదయాన్నే దేవాలయం వెళ్లి

చలనదీపాన్ని,

అచలరూపాన్ని

దర్శించుకున్నాను.

జ్ఞానగురు జ్ఞానప్రసూనాంబను,

మౌనగురు దక్షిణామూర్తిని

దర్శికుంచుకున్నాను.

* * *

అమ్మ దర్శనం చేసుకోగానే-

హృదయం ఒకవిధమైన ఆర్ధ్రతతో నిండిపోయింది...

ఒక విధమైన స్తబ్ధత ఏర్పడింది...

ఒక విధమైన మైకం ఆవహించింది...

ఆ కాసేపు నాలోని భావాలు, అక్షరాలుడిగి, ఊరుకున్నాయి...

మళ్లీ ఈ వ్యవహారజగత్తులోకి రాగానే-

భావాలు ఉప్పొంగాయి...

అక్షరాలు జలజల జాలువారాయి...

ఏవో రాతలు రాస్తేగాని, ఏవో గీతలు గీస్తేగానీ, తగ్గని ఆవేశం కలిగింది.

ఇదొక ప్రారబ్ధం.

గతంలో గురువుగారు ఓ మాటన్నారు-

ఒకడు పుస్తకాలు వ్రాయడం వాడి ప్రారబ్ధం.

ఇంకొకడు ఆ పుస్తకాలు చదివి బుర్ర బద్దలు చేసుకోవడం వీడి ప్రారబ్ధం. అని.

ప్రారబ్ధం ఉన్నవారు చదువుతారు.

ప్రారబ్ధం లేనివారు బ్రతికిపోతారు.

* * *

జ్ఞానాంబ సన్నిధిలో భక్తి ఆవహిస్తుంది.

సద్గురు సన్నిధిలో జ్ఞానం ఆవహిస్తుంది.

జగత్తులోకి రాగానే కర్మ ఆవహిస్తుంది.

అంగట్లో వ్యాపారిగా...

ఇంట్లో సంసారిగా...

సత్సంగంలో సన్యాసిగా...

మూడు పాత్రలను నిర్వహించే mono actor గా

నా జీవితం రసమయంగా కొనసాగుతోంది.

అమ్మా జ్ఞానాంబయే.

గురువూ జ్ఞానాంబయే.

భార్యా జ్ఞానాంబయే.

అమ్మ వద్ద ఉన్నప్పుడు "శిశువు"గా ఉంటాను.

గురువు వద్ద ఉన్నప్పుడు "శిష్యుడు"గా ఉంటాను.

భార్య వద్ద ఉన్నప్పుడు "శివుడు"గా ఉంటాను.

ఏ సమయానికా సమయంలో తటస్థపడే పరిస్థితులనే

దైవప్రసాదంగా స్వీకరిస్తూ...

ఏ క్షణానికాక్షణం జీవితం పరిపూర్ణమౌతూ సాగిపోతోంది...

"జీవితప్రయోజనం" అనే గొడవ నాకు లేదు...

నా పాత్రను ప్రవేశపెట్టినవానిదే ఆ ప్రయోజనం...

ఉద్దేశాలు, ప్రయోజనాలు, లక్ష్యాలు...

ఇవేవీ నాకు లేవు, ఇవేవీ నేను కావు.

నాకీ జ్ఞానం కూడా ఆ జ్ఞానం యొక్క స్పర్శవలన కలిగిందే.

విద్యుత్ స్పర్శ వలన యంత్రం కదిలినట్లుగా.

నా ఉనికి, నా శక్తి, నా జ్ఞానం మూడూ భగవంతునివే.

* * *

మీరు కర్మయోగియా? భక్తియోగియా? లేక జ్ఞానయోగియా?

అని ఒకరు వివేకానందులవారిని అడిగారు.

"నేను ఏ యోగానికీ సంబంధించినవాడిని కాను"

అని సూటిగా సమాధానమిచ్చారు వివేకానందులు.

నిజమే వారు శివావతారులు.

వారు జ్ఞానయోగి కాదు, జ్ఞానమూర్తులు.

"యోగి" పదం యెప్పుడూ "సాధకుడు" అని తెలియజేస్తుంది.

వారు జన్మతః సిద్ధులు.

పరమహంస సైతం వారి దర్శనం కోసం పరితపించేవారు.

నరేన్ ను తీసుకురమ్మని మనుషులను పంపేవారు.

నరేన్ రానంటే, కాళికాంబతో మొరపెట్టుకునేవారు.

"అమ్మా! నరేన్ ను చూడాలని ఉంది..." అని.

వెంటనే అక్కడ వివేకానందులకు ప్రేరణ కలిగేది, పరమహంసను చూడాలని.

పరుగెత్తుకువచ్చేవారు దక్షిణేశ్వరానికి.

* * *

"సముద్రాలు ఏడు" అని విభజించే ఆనకట్టలేమన్నా ఉన్నాయా?

ఆకాశాన్ని చేరుకోవడానికి మార్గాలేమైనా ఉన్నాయా?

అంతే పరతత్త్వ విషయంలో కూడా...

ఆదిమధ్యాంత రహితమైన భగవంతుణ్ణి చేరుకోవడానికి యోగమేమి? మార్గమేమి?

ఆ యోగుల్ని ప్రక్కన ఉండి చూసేవాళ్లకు ఉన్న తేడాలే తప్పితే,

ఆ యోగుల్లో తేడాలేవీ ఉండవు.

లోపల ఆ యోగులందరూ అనుభవించే ఏకాత్మతత్త్వం ఒక్కటే.

"ఉండేది రాముడొక్కడు ఊరకె చెడిపోకె మనసా!"

అని గానం చేశారు త్యాగరాజు.

ఆ ఒక్క వాక్యంలో కర్మ-భక్తి-జ్ఞాన మూడు యోగాలూ ఉన్నాయి.

ఆ ఒక్క పరతత్త్వాన్నే "రాముడు" అన్నాడు త్యాగరాజు.

ఆ ఒక్క పరతత్త్వాన్నే "అరుణాచలశివుడు" అన్నాడు రమణుడు.

ఆ ఒక్క పరతత్త్వాన్నే "అల్లా" అన్నాడు బాబా.

ఆ ఒక్క పరతత్త్వాన్నే "పరలోకపు తండ్రి" అన్నాడు క్రీస్తు.

కర్మ అనేది భక్తి, జ్ఞానములతో మిళితమై ఉంటుంది.

భక్తి అనేది కర్మ, జ్ఞానములతో మిళితమై ఉంటుంది.

జ్ఞానం అనేది భక్తి, కర్మలతో మిళితమై ఉంటుంది.

అసలు ఆ మూడింటి మధ్య విభజనే లేదు.

కలకండలో ఉన్న తియ్యదనం-గట్టితనం-తెల్లదనం లాంటిది ఆ మూడు యోగాలు.

ఈ మూడింటిలో ఒక్కటి లోపించినా దానిని కలకండ అని ఎవరూ అనరు.

* * *

ప్రక్కనుండి చూసేవాడు ఫలానా అతను భక్తియోగి అని, ఫలానావాడు జ్ఞానయోగి అనీ అనుకోవచ్చునేమోగాని, ఏ యోగి కూడా నేను ఫలానా యోగినని అనుకోడు.

నేను భక్తియోగినని పరమహంస యెక్కడైనా చెప్పారా?

నేను జ్ఞానయోగినని రమణులు ఎక్కడైనా చెప్పారా?

వారు ఆ ఏకాత్మతత్త్వంతో మమేకమై ఉన్నారు. అంతే.

బాహ్యంలో ఉన్న వారి జీవన విధానాన్ని అనుసరించి వారికి ఆయా పేర్లు పెట్టేస్తారు జనులు.

ధర్మం శరణం గచ్ఛామి... అన్న బుద్ధుణ్ణి

కర్మయోగి అన్నారు.

ప్రతి విషయంలోనూ "భగవదిచ్ఛ"... అన్న పరమహంసను

భక్తియోగి అన్నారు.

సదా ఆత్మనిష్ఠలో ఉండే అరుణాచల రమణుణ్ణి

జ్ఞానయోగి అన్నారు.

* * *

భగవాన్ కొండమీద ఉండగా...

ఆశ్రమానికి మట్టిగోడ కడుతుండగా...

భగవాన్ ఎక్కడ? అని భగవాన్నే అడిగారొకరు.

"పైకి వెళ్లు" అన్నారు భగవాన్.

అయ్యో స్వామీ... యెందుకలా చెప్పారు? అన్నది ఎచ్చెమ్మాళ్.

"ఏం చేయమంటావ్...నేనే భగవాన్ అని మెళ్లో బోర్డు వేసుకోమంటావా? అన్నారు భగవాన్.

"పైకి వెళ్లు" అనేది అబద్ధం కాదు.

"అరుణాచలేశ్వరుడే నిజంగా భగవాన్" అని చెప్పడం.

అందరిలో భగవాన్ ను చూసేవిధంగా పైకెళ్లు(ఎదుగు)

అని చెప్పడం.

* * *

నిన్న ఒకరు అడిగారు-

అవధూతకు నిర్వచనం చెప్పండి అని.

నిర్వచనాలు ఏం చేసుకుంటారు?

అవధూతకు నిర్వచనం చెబితే,

ఋషికి నిర్వచనం చెప్పండి అని అడుగుతారు.

ఋషికి నిర్వచనం చెబితే,

అత్యాశ్రమికి నిర్వచనం చెప్పండి... అని అడుగుతారు.

ఈ ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ నిర్వచనాలతో నిండిపోయి ఉన్నాయి.

"భగవంతుడు అనిర్వచనీయుడు" అని చెబుతుంటే,

భగవంతుణ్ణి ఈ నిర్వచనాల మధ్య వెతుకుతున్నారెందుకు?

కర్మలో మునిగిపో.

భక్తిలో కరిగిపో.

జ్ఞానంలో నిలిచిపో.

"ఉన్నది ఏదో ఉన్నది" అని

"నీవు లేనే లేవు" అని

తెలుసుకో.

** *

### *276. విచారణ అంటే-నిత్యానిత్యవస్తు వివేచన*.

రాత్రి ఒక స్వప్నం...

దేవాలయం నుండి ఊరెరిగింపుగా

కృష్ణభగవానుని ఉత్సవమూర్తి వెలుపలికి రాగానే

భావావేశంతో.... ఓ అని ఏడ్చాను....

మెలకువ రాగానే అనుకున్నాను...

నాలో ఇంత భావావేశం ఉందా? అని.

అయినా జ్ఞానాంబను తప్ప

అన్యదేవతల్ని నేనెప్పుడూ స్మరించిందే లేదు.

మరి కృష్ణుడెందుకు కనబడ్డాడో!

నేనెందుకు అలా ఏడ్చానో!

* * *

మెలకువలోని భావాలే స్వప్నలోకానికి పునాదులు.

కలవరింత పలవరింతలు మనోదర్పణంలోని ప్రతిబింబాలు.

కొందరు ఎంతో గాంభీర్యంతో ఉంటారు.

కొన్ని భావాలను అణచుకొని ఉంటారు.

అణచబడిన ఆ భావాలే కలవరింతలుగా, పలవరింతలుగా వ్యక్తమయ్యేది.

అలా అణచబడిన వాసనలే

మరణానంతరం పునర్జన్మగా వ్యక్తమయ్యేది.

అందుకే పునర్జన్మ వద్దనుకున్నవారు

దేనినీ వరించకూడదు, దేనినీ స్మరించకూడదు.

స్మరణే సంస్కారంగా...

సంస్కారమే వాసనగా...

వాసనే పునర్జన్మగా...

వికసిస్తుంది కాబట్టి.

* * *

ఒకావిడ  భగవాన్ను "నాకేమీ వద్దు భగవాన్...ఒక్క మోక్షం తప్ప." అని అంది.

భగవాన్ నవ్వుతూ-

"ఏమీ వద్దనుకుంటే అదే మోక్షం" అన్నారు.

* * *

ఏమీ వద్దనుకోవాలంటే, బాహ్యవిషయాలపై అనురక్తి వదలాలి.

అనురక్తి వదలాలంటే, విరక్తి కలగాలి.

విరక్తి కలగాలంటే, విచారణ చేయాలి.

విచారణ అంటే-

నిత్యానిత్యవస్తు వివేచన.

ఏది అనిత్యమైనదో దానిని వదలడం.

ఏది నిత్యమైనదో దానిలో నిలవడం.

ఇదే జ్ఞానం, ఇదే మోక్షం.

* * *

"అంతర్దృష్టి  కలిగినప్పుడు బాహ్యదృష్టి దానంతట అదే నయమవుతుంది" అన్నారు భగవాన్.

జగద్దృష్టి తొలిగి, తన్ను తానెరిగి

ఒకటి, రెండును మాని

'నేను' లేని స్థితి సర్వసమ్మతము.

అని ఉన్నదినలుబదిలో చెప్పారు భగవాను.

అంతర్దృష్టి కలిగాక జగద్దృష్టి తొలగుతుందా?

జగద్దృష్టి  తొలిగాక అంతర్దృష్టి కలుగుతుందా?

రెండూ ఒకటే.

లోపల్నుంచి ఊడ్చుకుంటూ రావడం - ధ్యానం.

బయట్నుంచి ఊడ్చుకుంటూ వెళ్లడం - జ్ఞానం.

బాహ్యాంతరాలకు ద్వారబంధం - దేహం.

* * *

భగవద్గీతలోని శ్లోకాలను చిన్నప్పుడు కొన్ని కంఠతా పెట్టి ఉన్నాను.

ముఖ్యంగా శ్రీవైష్ణవులు ఆరాధించే చరమశ్లోకం-

సర్వధర్మాన్ పరిత్యజ్య....

"అన్నీ వదిలెయ్యరా బాబూ....

నన్నొక్కణ్ణి పట్టుకో చాలు..."

ఇదే భగవద్గీతాసారం.

మోక్షం అంటే-

చక్రాన్ని వదిలి,

ఇరుసును పట్టుకోవడమన్న మాట.

పరిధిని వదిలి,

కేంద్రంలో నిలవడమన్న మాట.

* * *

"భగవాన్...! భగవద్గీతలో మీకు ఇష్టమైన శ్లోకమేది?"

అని ఒకరడిగారు భగవాన్ను.

భగవాన్ ఆ భక్తునికి ఈ క్రింది శ్లోకాన్ని అనుగ్రహించారు-

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః |

అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ||

అర్జునా! సమస్త జీవుల హృదయాలలో ఉండే ఆత్మను నేనే.

సర్వభూతముల ఉత్పత్తి, స్థితి, ప్రళయకారణమూ నేనే.

* * *

ఇది చదివి నేనూ గురువుగారిని అడిగాను ఓ రోజు...

గీతలో మీకు ఇష్టమైన శ్లోకమేది? చెప్పండి అని.

గురువుగారు ఈ క్రింది శ్లోకాన్ని నాకు అనుగ్రహించారు.

ఉపద్రష్టా2నుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః |

పరమాత్మేతి చాప్యుక్తో దేహే2స్మిన్ పురుషః పరః ||

ఈ శరీరంలో అంటీ అంటనట్లుగా వుండే పరమపురుషుణ్ణి సాక్షి, అనుమతించేవాడు, భరించువాడు, అనుభవించువాడు, మహేశ్వరుడు, పరమాత్మ అని చెబుతారు.

భగవంతుడికి "అనుమంతా" అని పేరు.

అన్నిటినీ అనుమతించేవాడు, అద్దం వలె.

ఎదుటపడ్డ ప్రతి దృశ్యాన్నీ అది ప్రతింబింబిస్తుంది.

దేన్నీ నిరాకరించదు.

అద్దానికి మహాసౌందర్యవతీ ఒకటే.

వికారరూపిణీ ఒకటే.

వికారరూపులైన కొందరు తొలిసారిగా అద్దాన్ని చూసినప్పుడు, అందులోని తమ ప్రతిబింబాలను చూసి, నచ్చక అందరూ కలిసి అద్దాన్ని పగలగొట్టారట.

తమలోని దోషాల్ని అద్దం యొక్క దోషంగా ఎంచడం వల్లనే క్రీస్తును శిలువ వేశారు. క్రీస్తు పరిశుద్ధమైన అద్దం. కానీ క్రీస్తు పగిలే అద్దం కాదు. అందుకే మూడోరోజున శిష్యులకు దర్శనమిచ్చారు.

* * *

నాకు ఇష్టమైన గీతాశ్లోకం చెప్పాలంటే-

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః

ఉభయోరపి దృష్టో2న్త స్త్వనయో స్తత్త్వదర్శిభిః

లేనిది ఎప్పటికీ ఉండదు.

ఉన్నది ఎప్పటికీ లేకపోదు.

ఈ రెండింటి నిర్ణయం తత్త్వజ్ఞులకే తెలుస్తుంది.

* * *

సదా నా మనసులో కదలాడుతూ ఉంటుంది ఈ శ్లోకం.

సదా ఆత్మనిష్ఠలో ఉంచుతుంది నన్ను ఈ శ్లోకం.

ఉన్నదానికి లేమి లేదు.

లేనిదానికి ఉనికి లేదు.

లేనిది పుట్టదు.

ఉన్నది చావదు.

ఈ నాలుగు మాటలే నాలుగు వేదాల సారం.

ఈ నాలుగు మాటలే నా ధ్యానమంత్రం.

నిత్యవస్తువు పుట్టదు.

లేనివస్తువూ పుట్టదు.

ఇదే అజాతవాదం.

ఇదే సద్గురు హృదయం.

* * *